

వైవీయూ ఇంజినీరింగ్ ఫలితాలు విడుదల

కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం డాక్టర్ వైఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ రెండు మూడు సంవత్సరాల సెమిస్టర్ల ఫలితాలను విసి ఆచార్య చింతా సుధాకర్ విడుదల చేశారు. గురువారం విశ్వవిద్యాలయంలోని తన ఛాంబర్‌లో పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్ ఈశ్వర్ రెడ్డి, వైవీయూ పీజీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎస్ రఘునాథరెడ్డి, వైఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఆచార్యులు సి నాగరాజు, డీన్ కె.వి. రమణయ్య తో కలిసి ఫలితాల వివరాలను వెల్లడించారు. బీటెక్ (డిప్లమో) మూడో సంవత్సరం ఆరో సెమిస్టర్‌లో 90.7 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని వివరించారు. బీటెక్ (డిప్లమో) రెండో సంవత్సరం నాలుగో సెమిస్టర్ ఫలితాల్లో 81.13 శాతం మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. బిటెక్ సెకండ్ ఇయర్ నాలుగో సెమిస్టర్ ఫలితాల్లో 58.09 శాతం మంది, థర్డ్ ఇయర్ ఆరో సెమిస్టర్ ఫలితాల్లో 85.19 శాతం మంది ఉత్తీర్ణులయ్యారని వెల్లడించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విభాగాల విద్యార్థులను అభినందించారు. ఫైన్ ఆర్ట్స్ మొదటి సెమిస్టర్ ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణులయ్యారని తెలిపారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు

- మహిళలంటే ముఖ్యమంత్రికి అపారమైన గౌరవం
-హోం శాఖ మంత్రి తానేటి వనిత



గాంధీపార్క్‌ను ప్రారంభిస్తున్న హోంమంత్రి తానేటి వనిత, ఇన్‌ఛార్జి మంత్రి, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మహిళలంటే అపారగౌరవ భావం ఉందని దేశంలో ఏరాష్ట్రంలో లేనివిధంగా తన పాలనలో ఇరువురు మహిళలను రాష్ట్ర హోమ్ మంత్రులుగా నియ మించారని హోంశాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో గురువారం పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, సేవ, భూమిపూజ కార్యక్రమాలను రాష్ట్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలపు సురేష్‌తో కలిసి నిర్వహించారు. అమృత్ మంచినీటి పథకం, మున్సిపల్ గాంధీ పార్కు, అర్బన్‌హెల్త్ సెంటర్, రాచమల్లువారి రాజన్నభోజనం కార్యక్రమాలను ప్రారంభించి మైదుకూరు రోడ్డు స్మార్ట్‌స్ట్రీట్‌కు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా రాజన్నభోజనం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బహి రంగ సభలో హోం మంత్రి మాట్లాడుతూ కడప అంటే తనకు వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి గుర్తుకొ స్తారని చెప్పారు. అన్నగా, తమ్ముడిగా, కొడుకుగా, మన వడిగా జగన్ అందరి అవసరాలు తీరుస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందాయన్నారు. పేదలకు ఒకపూట కడుపునిండా అన్నంపెట్టేందుకు ఎమ్మెల్యే రాచమల్లు ఉచిత భోజన కార్యక్రమాన్ని సొంత నిధులతో ప్రారంభించి 11 సంవత్సరాలపాటు శక్తి ఉంటే అనంతరం కూడ కొనసాగిస్తామని చెప్పడం గొప్పవిషయం అని చెప్పారు. మానవతా విలువలు కలిగిన రాచమల్లును వచ్చే ఎన్నికల్లో లక్ష మెజార్టీతో గెలిపించాలని కోరారు. అంతకు ముందు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ పాలన జనరంజకంగా, పారదర్శకంగా సాగుతోందన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి జోడుగుర్రాలుగా పరుగులు పెడుతున్నాయన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి మాట్లాడుతూ 2014-19 బాబు పాలనను, 2019-24 జగన్ పాలనను గమనించాలని, రాబోయే ఎన్నికల్లో ప్రజాప్రయోజనాలకు పాటుపడిన పార్టీకి మద్దతివ్వాలని కోరారు. 2019 నుంచి వైసిపి జెండా మేలు చేసిఉంటే మానవత్వంతో మద్దతివ్వాలని లేకుంటే తిరస్కరించాలని కోరారు. నాలుగు దశాబ్దాలుగా ఎలాంటి అభివృద్ధికి నోచుకోని ప్రొద్దుటూరును ఈ నాలుగు సంవత్సరాలలో అభివృద్ధి, సంక్షేమంలో పరుగులు పెట్టించమన్నారు. వివక్షలేకుండా కేవలం పేదరికమే ప్రామాణికంగా తీసుకొని సంక్షేమ పథకాలు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బి.లక్ష్మీదేవి, వైస్ చైర్మన్లు ఖాజీమొహిద్దీన్, బంగారెడ్డి, వైసిపికి చెందిన కౌన్సిలర్లు, నాయకులు, మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, సిబ్బంది, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

అసైన్‌మెంట్ పట్టాలు మంజూరు చేయాలి

- స్మార్ట్‌సిటీని ప్రభుత్వ ఖాళీ స్థలంలో నిర్మించాలి

ప్రజాశక్తి - బద్వేలు



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

గోపవరం మండలం మడకలవారిపల్లె దళితుల నుంచి సేకరించిన భూములకు వెంటనే అసైన్‌మెంట్ పట్టాలు మంజూరు చేయాలని, స్మార్ట్‌సిటీని ప్రభుత్వ ఖాళీ స్థలంలో నిర్మించాలని అఖిలపక్ష కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం బద్వేల్ సిఐటియు పట్టణ కార్యాలయంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్, సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వీరశేఖర్, ఆంధ్రప్రదేశ్ బిసి చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షులు బి.సి. రమణ, దళిత ఉద్యమ సీనియర్ నాయకులు ఒ.ఎస్.వి ప్రసాద్, బిఎస్‌పి నాయకులు గౌస్‌పీర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా గోపవరం మండలం, గోపవరం గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 1755 నుంచి 61 వరకు, 63 ఎకరాలు, 20 కుటుంబాల వారికి, సదరు మండలం మడకలవారిపల్లె దళితవాడకు చెందిన దళితులకు, 1972లో వారికి వ్యవసాయ నిమిత్తం ఇచ్చారని పేర్కొన్నారు. అప్పటి నుంచి దళిత కుటుంబాలు రాయి, చెట్టు తొలగించుకొని వర్షాధారపు పంటలు పెట్టుకుంటూ 50 సంవత్సరాలుగా వ్యవసాయం చేస్తున్నాయని చెప్పారు. వారికి వెంటనే అసైన్‌మెంట్ పట్టాలు ప్రభుత్వం మంజూరు చేయాలని వారు అఖిలపక్ష కమిటీ తరపున డిమాండ్ చేశారు. 1990లో ఒకమారు, 2003లో మరొక మారు, జిల్లా జడ్‌పిహెచ్‌డిసి వారు నాలుగు వ్యవసాయ బోర్లు వేశారని, మూడు బావులు తవ్వించారని, వాటి ఆధారంగా వ్యవసాయ పంటలు పండించుకుంటూ రెండు తరాలుగా పలసాయం పొందుతూ అనుభవంలో ఉన్నారన్నారు. ఈ భూమి భారత రాజ్యాంగం ద్వారా ఏర్పడిన కార్పొరేషన్ ఆఫ్ షెడ్యూల్ కులాల భూ రక్షణ చట్టం 1964 అనుసరించి జిల్లా షెడ్యూల్ కులాల సేవా సహకార సంఘం సహకారం అందించిందని, కేవలం వ్యవసాయానికి మాత్రమే ఉపయోగించుకోవాలని వారికి ఇచ్చినటువంటి చట్టబద్ధమైన రికార్డు అనుమతుల్లో రాతపూర్వకంగా రాసి ఉందని చెప్పారు. అలాంటి దళితుల భూమిని ముందస్తుగా వారికి నోటీసులు ఇవ్వకుండా, గ్రామసభ నడిపి ఆమోదం, దళితుల నుంచి ఎన్‌ఒసి తీసుకోకుండా, ప్రత్యామ్నాయ భూమి చూపకుండా, సాగులో ఉన్న దళిత వ్యవసాయదారులకు నష్టపరిహారం చెల్లించకుండా, ఏకపక్షంగా రాష్ట్ర ప్రభుత్వం ఎలా దళితుల భూములు లాక్కుంటారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది చట్ట విరుద్ధమని అధికారులకు తెలిసినా ప్రభుత్వం చెప్పినదానికల్లా డుడు బసవన్నలాగా తలలు ఊపి, దళితుల భూములు రద్దు చేశారని, హైకోర్టులో రిట్టు వేస్తే సదరు ప్రభుత్వానికి సహకరించిన అధికారులకు షోకాజ్ నోటీసులు వెళ్తాయని, వారు సంజాయిషి ఇవ్వాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం. బద్వేలు పట్టణ నాయకులు పి.చాద్‌బాషా, ఎస్.మస్తాన్, రాయప్ప, వెంకటసుబ్బయ్య, ఎం.చిన్ని, సిపిఐ నాయకులు బాల ఓబయ్య, ఇమ్మానియేల్, సంజీవ్ పాల్గొన్నారు.

సీట్లను పాత పద్ధతిలోనే భర్తీ చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన వైద్య విద్య కళాశాలల్లో ఉన్న సీట్లన్నీ కన్వీనర్ కోటా ద్వారా పాత పద్ధతిలోనే భర్తీ చేయాలని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయం కారణంగా వైద్య విద్యను అభ్యసించాలనే ఆలోచన కలిగిన విద్యార్థులు ఇబ్బందులు పడే ప్రమాదాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. కొత్తగా వైద్య కళాశాలలు వస్తే సీట్లు పెరుగుతాయని ఆశపడ్డ వారికి ఈ నిర్ణయం బాధ కలిగిస్తోందన్నారు. 2023-24 విద్య సంవత్సరం నుంచి రాజమహేంద్రవరం, నంద్యాల, మచిలీపట్నం, విజయనగరం, ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో 750 సీట్లకు జాతీయ వైద్య కమిషన్ ఆమోదం తెలిపిందన్నారు. వైద్య విద్య కళాశాలల్లో 50 శాతం సీట్లు అమ్మకానికి పెట్టాలనే ఉత్తర్వులను ప్రభుత్వం వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం అమల్లోకి రాకుండా ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలన్నారు. సమావేశంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి పాల్గొన్నారు.

252 పరుగులకు నెల్లూరు ఆలౌట్

ప్రజాశక్తి - కడప



తలపడుతున్న కర్నూలు, అనంతపురం జట్లు

కెఒఆర్‌ఎం క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో ఒక వికెట్ నష్టానికి 29 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 61.3 ఓవర్లలో 252 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని అర్జున్ 92, పవన్ రిత్విక్ 77 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని బ్రహ్మసాయి బౌలింగ్లో అద్భుతంగా రాణించి 5 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు రెండవ ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి 28 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 114 పరుగులు చేసింది. ఆ జట్టులోని భవాని ప్రసాద్ 46, రెడ్డి రుషిల్ 48 పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని భార్గవ్ మహేష్ 3 వికెట్లు తీసుకున్నాడు. **మొదటి ఇన్నింగ్స్ లో అనంతపురం 321..** వై.ఎస్ రాజారెడ్డి ఏసి ఏ స్టేడియంలో నిర్వహిస్తున్న వేరొక మ్యాచ్‌లో 5 వికెట్ల నష్టానికి 95 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 82.1 ఓవర్లలో 321 పరుగులకు ఆల్ అవుట్ అయింది. ఆ జట్టులోని సి.వి. దినకర్ 94, కరీం బాబా 66, లీలా సాయి 48 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని దినేష్ కుమార్ 3 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు ఆట ముగిసే సమయానికి 37 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 148 పరుగులు చేసింది. ఆ జట్టులోని సాయి సూర్య తేజరెడ్డి 67 పరుగులు చేశాడు. అనంతపురం జట్టులోని టి. ప్రదీప్ రెడ్డి 2, జె. లీలా సాయి 2 వికెట్లు తీసుకున్నారు.

గోరీలు తొలగిస్తే ఊరుకోం

ప్రజాశక్తి- కడప అర్బన్

చరిత్రను చాటే దొరల గోరీలు రోడ్డు విస్తరణలో తొలగిస్తే ఊరుకోమని అఖిలపక్ష పార్టీల నాయకులు హెచ్చరించారు. హరి టవర్స్ లో గురువారం టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ ఆధ్వర్యంలో అఖిలపక్ష కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంగ్లేయ పాలకులుగా కడపలో ఉండి చనిపోయిన ప్రముఖుడైన వెబ్ తాకరే, మద్రాసు సివిల్ సర్వీస్ అధికారిగా సేవలందించి 1807, సెప్టెంబర్ 1న చనిపోతే సమాధి చేశారన్నారు. ప్రసిద్ధ ఆంగ్ల నవలా రచయిత విలియం మేక్ పీస్, లెఫ్ట్ నెంట్ జార్జ్ రసం బొడ్డం, చార్లెస్ వేర్ స్టాంప్ లెటర్ కాటన్ బెంగాల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ ఇంజినీరు సమాధులు చేయడం వల్ల దొరల గోరీగా శ్మశాన వాటిక పేరు గాంచింది అన్నారు. బ్రిటీష్ అధికారుల రికార్డు మేరకు 71 సమాధులు ఉన్నాయని చెప్పారు.సమాధులు తొలగిస్తే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం నగర కార్యదర్శి రామ మోహన్, సిపిఐ నాయకులు సుబ్రమణ్యం, గుర్రప్ప, హేతువాద సంఘం నాయకులు సి ఆర్ వి ప్రసాద్ పాల్గొన్నారు.

యూనిఫామ్ కోడ్ బిల్లుకు టిడిపి వ్యతిరేకం

కడప అర్బన్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టే యూనిఫాం కోడ్ బిల్లును టిడిపి వ్యతిరేకిస్తుందని, ముస్లిములకు నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం గాయత్రీ టవర్స్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం మనోభావాలు, మత ఆచారాలను ఇబ్బంది పెట్టే విధంగా ఏ బిల్లును తెచ్చినా టిడిపి వ్యతిరేకిస్తుందని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లో మద్దతు ఇవ్వమని చంద్రబాబు నాయుడు ముస్లిములకు స్పష్టత ఇచ్చారని చెప్పారు. రాష్ట్రంలో ఉన్న మైనార్టీ, క్రిస్టియన్ మైనార్టీల వెంట టిడిపి ఉంటుందని తెలిపారు. మైనార్టీల భద్రత, మనోభావాలు, ఆత్మ గౌరవాన్ని టిడిపి ఎప్పుడు కాపాడుతుందని పేర్కొన్నారు. యూనిఫాం సివిల్ కోడ్ విషయంలో మైనార్టీలు ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

మున్సిపల్ ఆప్కాస్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్



రిలేదీక్షలు చేస్తున్న మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ ఆప్కాస్ చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులు రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు సుంకర రవి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పనికి తగ్గ వేతనం ఇవ్వాలని కోరారు. సిపిఎస్ రద్దుచేయాలని పేర్కొన్నారు. క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి 2019 ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతగా అసెంబ్లీలోనూ, పాదయాత్రలోనూ మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులకు అనేక హామీలిచ్చారని తెలిపారు. మన ప్రభుత్వం వచ్చిన వెంటనే వారం రోజుల్లో సిపిఎస్ రద్దు, ఉద్యోగులకు మెరుగైన పిఆర్‌సి. ఇస్తానన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని 6 నెలల్లో రెగ్యులర్ చేస్తామని, మున్సిపాలిటీలలో దళారివ్యవస్థ రద్దు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. సిఐటియు నగర అధ్యక్షుడు చంద్రారెడ్డి మాట్లాడుతూ దళారి వ్యవస్థద్వారా క్లాప్ డ్రైవర్లను నియమించి కనీస వేతనాలు ఇవ్వడం లేదని విమర్శించారు. మున్సిపల్ స్కూళ్ళను విద్యాశాఖలో విలీనం చేసి 2 వేల మంది స్వీపర్లను ఇళ్లకు పంపించారని ఆవేదన వ్యక్తం చేశారు. జగనన్న ప్రభుత్వం అందరికి శఠగోపం పెట్టిందని తెలిపారు. 100 శాతం హామీలు అమలు చేసిన ప్రభుత్వం మాదని ఢాంభికాలు పలుకుతున్నారని విమర్శించారు. 100 శాతంలో మున్సిపల్ కార్మికులు ఉన్నట్టా ? లేనట్టా ? అని ప్రశ్నించారు. దీక్షలో మహిళా కార్మికులు కూర్చున్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు కంచుపాటి తిరుపాల్, ఇత్తడి ప్రకాష్, ఆనందరావు, గోపి, కిరణ్, ఆదాం, పుల్లయ్య, కొండయ్య, బాబు, నాగరాజు, హిమాలయ పుల్లయ్య, కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు సిగ్గు చేటు : ఎస్ఎఫ్ఐ



నిరసన తెలియజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి- కడప అర్బన్

ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఉచితంగా ఇవ్వాలని అడిగితే ఎస్ఎఫ్ఐ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం తాడేపల్లిలో ఎస్ఎఫ్ఐ నాయకుల అక్రమ అరెస్టులను నిరసిస్తూ కడప ఆర్ట్స్ జూనియర్ కళాశాల వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయం ముట్టడికి బయలుదేరిన నాయకులను పోలీసులు అడ్డుకుని అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని విమర్శించారు. కళాశాలలు ప్రారంభం అయి 48 రోజులు కావస్తున్నా ప్రభుత్వం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని శాంతియుతంగా ఆందోళనలు చేపడితే రాష్ట్ర వ్యాప్తంగా ఎస్.ఎఫ్.ఐ నాయకత్వాన్ని ఎక్కడికక్కడ అరెస్ట్ చేయడం వైసిపి ప్రభుత్వానికి తగదని హెచ్చరించారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేస్తుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఇంటర్మీడియట్ విద్యార్థులకు వెంటనే పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సునీల్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు. **పోరుమామిళ్ల :** ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు ఇవ్వాలని అడిగితే తాడేపల్లిలో ఎస్ఎఫ్ఐ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని ఎస్ఎఫ్ఐ నాయకులు వీరపోగు రవి తెలిపారు. గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరుమామిళ్లలోని జూనియర్ కళాశాల వద్ద అక్రమ కేసులను నిరసిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఈ నె 19న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చలో విజయవాడలో భాగంగా ముట్టడి కార్యక్రమం చేపట్టరని విద్యార్థి నాయకులను అక్రమంగా అరెస్టు చేసిన కేసులు సరికాదని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శి నగరికంటి సందీప్, జాల సుమంత్ మండల ఉపాధ్యక్షులు వైష్ణవి, వంశీ, నవిత, వినయ్ కుమార్, సహాయ కార్యదర్శులు రమాదేవి, కరిష్మా ,మానస, అర్చన కమిటీ సభ్యులు తేజ్, శివ శంకర్, వెంకటేష్ పాల్గొన్నారు.

విఆర్ఎల న్యాయమైన కోర్కెలను తీర్చాలని నిరసన

చింతకొమ్మదిన్నె : విఆర్ఎల న్యాయ సమ్మతమైన కోర్కెలను వెంటనే ప్రభుత్వం నెరవేర్చాలని జిల్లా ఇఆర్ఏల సంఘం అధ్యక్షుడు నాగేంద్ర పేర్కొన్నారు, గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట గ్రామసేవకలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ గ్రామ సేవకుల ఆధ్వర్యంలో విఆర్ఎల ప్రధాన డిమాండ్ అయిన పే స్కేల్ అమలు చేయాలని, నామినీలుగా పనిచేస్తున్న విఆర్ఎలను విఆర్ఒలుగా నియమించాలని పేర్కొన్నారు. వారికి వేతనం నెలకు రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మండల విఆర్ఎల సంఘం అధ్యక్షులు మీసాల శివప్రసాద్, ఉపాధ్యక్షులు వెంకటరమణ, విఆర్ఎలు రాజు, దేవి, పాలయ్య,శాంతి, రమాదేవి పాల్గొన్నారు.

లోకేష్‌కు ఆదరణ పెరిగింది



మాట్లాడుతున్న ఆమూరి బాలదాసు

కడప అర్బన్ : యువగళం పాదయాత్ర ప్రజల్లో ప్రజాదరణ పెరగడం లోకేష్ రాజకీయ సామర్థ్యానికి నమ్మకాన్ని పెంచిందని టిడిపి అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు అన్నారు. గురువారం టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు జగన్మోహన్ రెడ్డిని రాజశేఖర్‌రెడ్డి కుమారుడిగా ముఖ్యమంత్రి చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి స్థాయిని దిగజార్చుకుంటూ అధికారం ఉంది కదా అని వీధి రౌడీలా పాలన సాగిస్తూ ప్రజలు ప్రశాంతంగా జీవించే పరి స్థితి లేకుండా చేశారని విమ ర్శించారు. జగన్మోహన్ రెడ్డికి ఓట్లు వేసి తప్పు చేశామని ప్రజలు బాధ పడు తున్నాం`న్నారు. చంద్రబాబు నాయకత్వం రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. ఏ రాజకీయ పార్టీతో పొత్తు లేకపోయినా ప్రజలు టిడిపికి పట్టం కడ తారని పేర్కొ న్నారు. పోత్తులవల్ల మిగతా పార్టీలకు బలం పెరుగుతుంది తప్ప పార్టీకి ప్రయో జనం లేదని అన్నారు. చంద్రబాబు నాయుడు ఆలస్యం చేయకుండా ఎమ్మెల్యేలుగా పోటీ చేసే అభ్యర్థుల పేర్లను ప్రకటించాలని తెలిపారు. సమావేశంలో 12వడివిజన్ ఇన్‌ఛార్జి దేరంగుల శివ, తెలుగు యువత నగర అధ్యక్షుడు మేకల వెంకటేశ్ యాదవ్ పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై మక్కువ అవసరం

ప్రజాశక్తి - వల్లూరు

రైతులు ఉద్యాన పంటలపై మక్కువ చూపాలని డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి అన్నారు. గురువారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలంలో చేపడుతున్న వివిధ పనులను ఆయన తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని ఆదినిమ్మాయిపల్లి, పుత్త చిన్నయపల్లి, గాలివారిపల్లి ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పండ్ల తోటలను ఆయన పరిశీలించారు. మామిడి ,చీనీ చెట్లు నాటిన రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వారి పండ్ల తోటల్లో సస్యరక్షణ చర్యలపై సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ రైతులకు ఉపాధి పథకం కింద రావాల్సిన మొత్తాన్ని ఎప్పటికప్పుడూ రైతుల ఖాతాల్లోకి జమ అయ్యేలా చూడాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. మండలంలో రైతులకు మంజూరైన పండ్ల మొక్కలు వెంటనే అందించాలని తెలియజేశారు. కార్యక్రమంలో కమలాపురం ఏపీడీ జయసింహ, ఏపీవో పార్థసారథి, ఇసి అంజలి, టిఎ రెడ్డయ్య, ఎఫ్ఎ ఓబయ్య, పావని, చెన్నకేశవ, రైతులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ద్వారా మరిన్ని సేవలు

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

రానున్న రోజుల్లో మరిన్ని సేవలు జగనన్న సురక్ష ద్వారా అందుబాటులోకి రానున్నాయని ప్రభుత్వ సలహాదారు పి.నాగార్జునరెడ్డి అన్నారు. గురువారం పోరుమామిళ్ల మండలంలోని గానుగుపెంట సచివాలయం పరిధిలో జగనన్న సురక్షను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథి ఆయన పాల్గొన్నారు. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత ఎలక్షన్లకు ముందు ఇచ్చిన హామీలు ప్రకారం నవరత్నాల కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి అందులో 42 రకాల సేవలను తీసుకొచ్చారని తెలిపారు. సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత 540 రకాల సేవలను తీసుకొచ్చారన్నారు. ఇక రాబోయే రోజుల్లో భూముల రిజిస్ట్రేషన్లు, బస్సు, రైల్వే, విమాన టికెట్లు సచివాలయంలోనే అందుబాటులోకి తీసుకొస్తారన్నారు. కార్యక్రమంలో సి.వెంగళ్ రెడ్డి, వీరభద్రుడు, సర్పంచ్ బాలయ్య, జడ్‌పిటిసి ముత్యాల ప్రసాద్,మండల ఉపాధ్యక్షుడు సి. బాష, ఎంపిటిసి కృష్ణారెడ్డి, తహశీల్దార్ గంగయ్య, ఎంపిడిఒ చంద్ర మౌళి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు స్థానికులు పాల్గొన్నారు.

ప్రజలకు రక్షణ కల్పించడంలో బిజెపి విఫలం

- కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు విష్ణు ప్రీతంరెడ్డి

ప్రజాశక్తి - కడప



మాట్లాడుతున్న విష్ణుప్రీతంరెడ్డి

దేశ ప్రజలకు రక్షణ కల్పించడంలో బిజెపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు విష్ణు ప్రీతమ్ రెడ్డి, నగర మహిళా అధ్యక్షురాలు లావణ్య ఆరోపించారు. గురువారం స్థానిక జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మణిపూర్‌లో విధ్వంసకాండపై ప్రధాని మోడీ కనీసం స్పందించడం లేదని వారు విమర్శించారు. పైగా అక్కడ ఏం జరుగుతుందో తెలియకూడదని ఇంటర్నెట్ కనెక్షన్లు కూడా కట్ చేయడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. సెంట్రల్ హోమ్ మినిస్టర్ అమిత్ షా అయితే ప్రతిపక్షాలపై కేసులు పెట్టడంలో ఉన్న శ్రద్ధ మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లపై, జరుగుతున్న విధ్వంసకాండ పై చర్యలు తీసుకోవడంలో లేదని ఆరోపించారు. ముగ్గురు మహిళలను నగ్నంగా ఊరేగింపు చేసి, తర్వాత వారి మీద అత్యాచారం చేసి విధ్వంసం చేస్తుంటే మీరేం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇదేనా దేశంలో మహిళలకు మీరు ఇచ్చే రక్షణ అని మండిపడ్డారు. మోడీ, అమిత్ షాల కుటుంబాలకో లేక బిజెపి మంత్రుల కుటుంబాలకో ఇలా జరిగితే మీరు స్పందించకుండా ఉంటారని ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు చెప్పలి పుల్లయ్య, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు మామిళ్ళ బాబు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

పోరుమామిళ్ల టౌన్ : స్థానిక ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, తోమాస్ రెడ్డి చిత్తా దంపతుల ఆధ్వర్యంలో వారి ప్రతినిధులు జి.శ్రీకాంత్ రెడ్డి, ఎల్.ప్రసాద్రెడ్డి బి.కోడూరు మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలైన తువ్వపల్లె, బి.కోడూరు, రామసముద్రం, మేకవారిపల్లె, రామచంద్రాపురం, రాజుపాలెం, అమ్మవారిపేట, విజయనగర్ కాలనీ, కృష్ణాపురంలలో చదువుతున్న బాల బాలికలు 550 మందికి 1650 నోటు పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నోటు పుస్తకాలను అందజేశామన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు హాజరై సంస్థ వ్యవస్థాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.

కృత్రిమ గర్భధారణపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-కలసపాడు



అవగాహన కార్యక్రమంలో మాట్లాడతున్న శారదమ్మ

మండలంలోని శంఖవరం పంచాయతీలో పశువుల కృత్రిమ గర్భధారణ విజయవంతంపై రైతులకు చక్కగా అవగాహన కల్పిం చాలని, జిల్లా పశు వైద్య సంచాలకులు డి.సి. శారదమ్మ తెలిపారు. గురువారం స్థానికంగా ఏర్పాటుచేసిన కృత్రిమ గర్భధారణపై రైతులకు అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండల పరిధిలో కృత్రిమ గర్భధారణలో సుమారు 60 లేగ దూడలు విజయవంతంగా ప్రదర్శనలు ఇచ్చేందుకు రైతులు ముందుకు వచ్చారని చెప్పారు. ఈ 60 లేగ దూడల ప్రదర్శనలో ప్రథమ, ద్వితీయ, ద్వితీయ, బహుమతులను స్థానిక సర్పంచ్ డి. రాధాదేవి, ఉపసం చాలకులు, డాక్టర్ వెంకటరమణయ్య, పశువైద్యాధికారి ఎ. వెంకటేశ్వరరావు, డిఎల్‌డిఎ రమేష్ సహాయ సంచాలకులు డాక్టర్ చంద్రశేఖర్, చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. మిగిలిన రైతులందరికీ కన్సలేషన్ బహుమతులను కూడా అందించారు. అనంతరం గోపాలమిత్ర చెన్నయ్య ఃకు సన్మానం చేసి అభినందించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

పోరుమామిళ్ల టౌన్ : టేకురుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రభుత్వ సలహాదారు పి నాగార్జునరెడ్డి గురువారం తనిఖీ చేశారు. వర్షాకాలం ప్రభావం వల్ల అనేక వ్యాధులు సంభవించే ప్రమాదముందని, డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు.అక్కడ ఉన్న సిబ్బందితోనూ , డాక్టర్ తోనూ, పేషంట్లతోనూ మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత సీజన్‌లో వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వారికి అందుబాటులో ఉంటూ నాణ్యమైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందిఇ సూచించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలి

కడప అర్బన్ : మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి, సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన అత్యంత హేయమైనదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం స్పందించాలని ఇన్సూరెన్స్ ఉద్యోగుల సంఘం, కడప డివిజన్ అధ్యక్షులు అవధానం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎ.రఘునాథరెడ్డి, శ్రామిక మహిళా కన్వీనర్ అమీనా పర్వీన్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. మణిపూర్‌లోని జాతుల కలహాలు ఇద్దరు యువతులను వివస్త్రలను చేసే స్థాయికి దిగజారిందంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయో అర్థంకాని స్థితి నెలకొని ఉందని తెలిపారు. సంఘటన జరగడమే కాకుండా, వీడియో వైరల్ అయిందంటే ఎంత హీన సంస్కృతి ప్రబలి ఉందో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం జోక్యం చేసుకోవాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చన్నారు.

కార్యదర్శి నుంచి జీతం వెనక్కి

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ముద్దనూరు

మండలంలోని ఓ గ్రామ పంచాయతీకి సంబంధించిన ఒక సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న గ్రేడ్-5 కార్యదర్శి సెలవుల కోసం లాంగ్ లీవ్ మంజూరు చేయాలని ఎంపిడిఒకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఆ మేరకు ఎంపిడిఒ లీవ్ మంజూరు చేసినట్లు ఉత్తర్వులు జారీ చేయలేదు. ఈ నేపథ్యంలో లాంగ్ లీవ్ కోసం దరఖాస్తు చేసుకుని విధులకు హాజరు కాని కార్యదర్శికి ఇన్‌ఛార్జి డిడిఒ జీతం బిల్లు పెట్టారు. ఆ కార్యదర్శి ఖాతాలో ప్రభుత్వం జీతం జమ చేసింది. ఇందుకు సంబంధించి ఈనెల 16న 'ప్రజాశక్తి' దినపత్రికలో ప్రచురితమైన 'సెలవులో ఉన్నా జీతం' అనే శీర్షిక కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన అధికారులు ఆ కార్యదర్శి నుండి జీతం వెనక్కి తీసుకుని చలానా రూపంలో ప్రభుత్వానికి తిరిగి చెల్లించారు. ఇందుకు బాధ్యులపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని ప్రజలు విమర్శిస్తున్నారు. వీరిపై తదుపరి చర్యలు తీసుకుంటారో లేదోనని ప్రజలు చర్చించుకుంటున్నారు.

సిఐటియు నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - జమ్మలమడుగు

పట్టణంలో సిఐటియు మొదటి మహాసభలు ఘనంగా విజయవంతంగా ముగిశాయి. అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, జిల్లా కార్యదర్శి సత్యనారాయణ ఆధ్వర్యంలో నూతన మొదటి సిఐటియు కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి దాసరి విజయ్, అధ్యక్షుడు దాసు, ట్రెజరర్ భాగ్యమ్మను ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక సందర్భంగా సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శి మాట్లాడుతూ అంగన్వాడీ, మున్సిపల్ వర్కర్స్ శానిటేషన్ వర్కర్స్, ఆటో కార్మికులు, ఇతర రంగాల కార్మికులందరికీ కూడా ఎన్నో ప్రతిష్టాత్మక కార్యక్రమాలను చేసే కార్మికుల పక్ష ఎనలేని సేవలు చేస్తామన్నారు. నూతన ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు, లక్ష్మీదేవి, ప్రసాదరెడ్డి, ఆదామ్, శేఖర్ నాగన్న, కో-ఆప్షన్ శివనారాయణ, సిఐటియు సభ్యులు నరేంద్ర, దస్తగిరి, రాజు, దివాకర్, జ్యోతి, రవి, అబ్రహం, గంగాధర్, కమలేశ్వర్, హుస్సేన్ వల్లి, నాగన్నలు ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ వర్కర్స్, అంగన్వాడీ వర్కర్స్, ఆటో యూనియన్ వర్కర్స్, శానిటేషన్ వర్కర్స్ పాల్గొన్నారు.

నగ్నంగా ఊరేగించిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మణిపూర్‌లో మహిళను నగ్నంగా ఊరేగించిన అల్లరి మూకలను తక్షణమే అరెస్టు చేసి శిక్షించాలని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్ రాజ్ తెలిపారు. గురువారం స్థానిక డివైఎఫ్ఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మణిపూర్‌లో అంత ఘోరంగా అల్లర్లు చేస్తున్న ఎందుకు మౌనంగా ఉన్నారో తెలియడం లేదన్నారు.

క్రైం కార్నర్

కూలీల ఆటో బోల్తా : వ్యక్తి మృతి

10 మందికి గాయాలు

ప్రజాశక్తి - వేంపల్లె

చీని తోటలోకి పనులు చేసేందుకు కూలీలను తీసుకెళుతున్న ఆటో అదుపుతప్పి గురువారం పులివెందుల-రాయచోటి బైపాస్ రోడ్డులో బోల్తా పడింది. దీంతో కుప్పాలపల్లి గ్రామానికి చెందిన రామయ్య (చంటి) (65) అనే కూలీ మృతి చెందగా, ఆటోలో ఉన్న దాదాపు 10 మందికి గాయాలయ్యాయి. మండలంలోని కుప్పాలపల్లెకు చెందిన కూలీలు చీని తోటలో పనులు చేసేందుకు ఆటోలో బయలు దేరారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు హుటాహుటిన గాయపడిన క్షతగాత్రులను చికిత్స కోసం 108 వాహనంలో వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ రామయ్య మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన వారిని ప్రథమ చికిత్స అనంతరం కడప రిమ్స్‌కు తరలించారు. కూలీల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రామయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి : టిడిపి

ఆటో బోల్తా పడిన ఘటనలో మృతి చెందిన రామయ్య అనే కూలీ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని టిడిపి పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి కోరారు. రామయ్య మృతదేహాన్ని సందర్శించడంతో పాటు గాయపడిన కూలీలను ఆయనతోపాటు నిమ్మకాయల దర్బార్, రామమునిరెడ్డి, మహమ్మద్ షబ్బీర్, తెలంగాణ వలి, జబిబుల్లా పరామర్శించారు. గాయపడిన కూలీలకు, ఆసుపత్రి వద్దకు వచ్చిన బంధువులకు దర్బార్ అల్పాహారాన్ని అంద జేశారు. కార్యక్రమంలో మహమ్మద్, డక్కా రమేష్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆటో బోల్తా : పసిపాప దుర్మరణం

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు- ప్రొద్దుటూరు ప్రధాన రహదారిలో గురువారం ఆటో బోల్తా పడిన సంఘటనలో 8 నెలల పసిపాప మృతి చెందిన సంఘటన పలువురిని కలిచివేసింది. స్థానికులు అందించిన వివరాల ప్రకారం.. అనంతపురం జిల్లా బంతలపల్లి సంచార జాతికి చెందినవారు పులివెందుల నుంచి బద్వేల్‌కు వెళుతుండగా మండలంలోని నాగులపల్లి సమీపంలో అధికంగా గాలి వీచడంతో ఆటో బోల్తా పడింది. ఆటోలో ఉన్న పాపకు బలమైన గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి.

కారును ఢీకొన్న లారీ

తృటిలో తప్పిన ప్రాణాపాయం

ప్రజాశక్తి - కొండాపురం

మండలంలోని జాతీయ రహదారిపై శ్రీ లక్ష్మీనరసింహ వేర్ హౌస్ ఎదురుగా బ్లాక్ స్పాట్ ఏరియాలో గురువారం లారీ కారును ఢీకొంది. వివరాలిలా ఉన్నాయి.. రాయచోటి మండలానికి చెందిన దంపతులు మరో వ్యక్తితో కలిసి తమ విద్యార్హత సర్టిఫికెట్ల కోసం ఏపి39బిపి 5782కారులో అనంతపురం వెళుతుండగా, కొండాపురం వద్ద జాతీయ రహదారి 67పై కడప వైపు వెళ్తున్న రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. అయితే కారులో బెలూన్ లు ఓపెన్ కావడంతో అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదస్థలాన్ని కొండాపురం ఎస్ఐ యోగేంద్ర పరిశీలించారు. ప్రమాద ఘటనపై ఎస్ఐ విచారించి లారీని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన వారిని ప్రథమ చికిత్స కోసం కొండాపురంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కొండాపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

బ్లాక్ స్పాట్‌ను గుర్తించని అధికారులు

జాతీయ రహదారి 67పై కొండాపురం మండల కేంద్రానికి కిలో మీటరు దూరంలో ఉన్న మలుపు వద్ద అనేక ప్రమాదాలు జరిగి ఎందరో ప్రాణాలను కోల్పోయారు. ఈ విషయం జాతీయ రహదారి మెయింటెనెన్స్ అధికారులకు తెలిసినప్పటికీ అక్కడ రోడ్డు భద్రత చర్యలకు సంబంధించి ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. ఈ విషయం తెలియక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఆ బ్లాక్ స్పాట్‌ను అధికారులు గుర్తించి సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చంద్రబాబు, జగన్ 'సీమ' ద్రోహులు

ప్రజాశక్తి - వేంపల్లె

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ఇద్దరూ రాయలసీమ ద్రోహులని, రాయలసీమకు దాపురించిన రాహుకేతువులని మాజీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. గురువారం వేంపల్లెలో తులసిరెడ్డి నివాసంలో రాయలసీమ స్టీరింగ్ కమిటీ అధ్యక్షులు, మాజీ శాసన సభ్యులు బైరెడ్డి రాజశేఖరరెడ్డి, తులసిరెడ్డి విలేకరులతో మాట్లాడారు. ముందుగా తులసిరెడ్డి మాట్లాడుతూ శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాజధాని, హైకోర్టులలో ఒక దానిని రాయలసీమలో ఏర్పాటు చేయవలసి ఉందన్నారు. బైరెడ్డి రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ రాయలసీమ సమస్యలు పరిష్కారం కోసం ఈనెల 28న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేపట్టిన ధర్నాకు ప్రజలు, రైతులు అందరూ విరివిగా తరలిరావాలని కోరారు. ఢిల్లీలో జరిగే ధర్నా కోసం తులసిరెడ్డి మద్దతు కోరేందుకు ఇక్కడికి వచ్చామన్నారు. జిల్లాలో ఉన్న సర్వరాయ ప్రాజెక్టు నుండి రైతులకు, ప్రజలకు నీరు ఇవ్వకుండా సిఎం జగన్‌కు చెందిన భారతి సిమెంట్స్ లిమిటెడ్‌కు పైపులైన్ ద్వారా నీరు సరఫరా చేయడం దురదృష్టకరమన్నారు. సమావేశంలో రాయలసీమ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి, కాంగ్రెస్ నాయకులు ధృవకుమార్‌రెడ్డి, డాక్టర్ సుబ్రమణ్యం, రామకృష్ణ, నరసింహారెడ్డి, అమర్, బాలంసుబ్బరాయుడు, ఉత్తన్న, ఆరుశేర్ల సుబ్బరాయుడు, నామా వినయ్, బద్రి, రాఘవయ్య, శివ, రవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బైరెడ్డి రాజశేఖరరెడ్డి, తులసిరెడ్డి

బిఎల్‌ఒలు నిజాయితీగా పనిచేయాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఓటరు జాబితాలో బిఎల్‌ఒలు నిజాయితీగా పనిచేస్తే ఎక్కడా అవకతవకలు జరగవని అన్ని రాజకీయ పార్టీలు నాయకులు పేర్కొన్నారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో గురువారం ఆర్‌డిఒ వెంకటేశులు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల రాజకీయ నాయకులు మాట్లాడుతూ ఇంటింటి సర్వేలో బిఎల్‌ఒలు కచ్చితంగా ఓటర్ జాబితా సరిచూసుకుంటూ నమోదు చేయాలని సూచించారు. మరణించిన వ్యక్తులు, పెళ్లి చేసుకొని ఇతర ప్రాంతాలకు వెళ్లిన మహిళల, తదితర వివరాలు తప్పక నమోదు చేస్తే ఓటరు జాబితా నిక్కచ్చిగా ఉంటుందన్నారు. జాబితా నమోదులో ఇంటి నెంబర్ కూడా ఖచ్చితంగా చూసుకోవాలని, ఆ ఇంటిలో ఎంతమంది ఉన్నారో అంత మందికి మాత్రమే ఓటు నమోదు చేయాలని పేర్కొన్నారు. ఆర్‌డిఒ మాట్లాడుతూ 18ఏళ్లు పూర్తయిన వారు ఓటు నమోదుకు బిఎల్‌ఒలకు సహకరించాలన్నారు. ఓటు జాబితాలో నిక్కచ్చిగా వచ్చేందుకు తహశీల్దార్లు సరిచూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైసిపి నుంచి వరప్రసాద్, రసూల్, టిఇపి నుంచి వెంకటరామిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, జనసేన తరపున శ్రీనివాసరెడ్డి, అన్ని మండలాల తహశీల్దార్లు పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : ఓటరు జాబితాను సరిచేయాలని అధికారులను జమ్మలమడుగు రెవెన్యూ డివిజనల్ అధికారి జి. శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం నియోజకవర్గ పరిధిలో ఎన్నికల నిర్వహణ విధులకు సంబంధించి అధికారులతో, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, ఎన్నికల అధికారి మల్లికార్జునరెడ్డి, జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల పొట్టగొడుతున్న ప్రభుత్వాలు : సిపిఎం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

చిరు వ్యాపారులందరికీ గుర్తింపు కార్డులు, వ్యక్తిగత రుణాలు అందించి అర్హులైన ప్రతి ఒక్క వీధి వ్యాపారులకు జగనన్న తోడు ఇవ్వాలని సిపిఎం జమ్మలమడుగు కార్యదర్శి శివనారాయణ తెలిపారు. గురువారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో ఆయన మావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శివనారాయణ మాట్లాడుతూ పేదల ప్రభుత్వాలుగా చెప్పుకుంటున్న బిజెపి, వైసిపి ప్రభుత్వాలు చిరు వ్యాపారులను దెబ్బతీస్తున్నాయన్నారు. రిలయన్స్, డిమార్ట్, మెట్రో తదితర బడా కంపెనీలకు రాయితీలిస్తూ చిరు వ్యాపారులను దెబ్బ తీస్తున్నాయన్నారు. బడా కంపెనీల ఆన్‌లైన్ వ్యాపారంతో చిన్న వ్యాపారాలు అతలా కుతలమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జగనన్న తోడు కాగితాలకే మిగిలిందని, కొద్ది మందికి మాత్రమే రుణాలు ఇచ్చి పాలకులు చేతులు దులుపుకుంటున్నారన్నారు. సమావేశంలో సిపిఎం నాయకులు కొండయ్య, శ్రీను, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పనులను వేగవంతం చేయాలి

చాపాడు : మండలంలోని అయ్యవారిపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం కేజీబీవీ పాఠశాలలో నాడు-నేడు పనులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. భవిత సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఒక విద్యార్థికి కాంక్లియర్ ఇంప్లాంటేషన్ చేయించుకోవడానికి ఆర్థిక స్తోమత లేక పిఒను అడుగగా వెంటనే స్పందించి సమస్య పరిష్కరించారు. కార్యక్రమంలో ఎంఇఒ వి.రవి శంకర్, కస్తూరిబా పాఠశాల ప్రత్యేక అధికారి నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, ఎంఆర్సీ సిబ్బంది మహేష్, శ్రీను, ఐఈఆర్టీ పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు అడిగితే అక్రమ అరెస్టులా

జమ్మలమడుగు : ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు ఇవ్వాలని, మధ్యాహ్నం భోజనం అమలు చేయాలని, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని కోరుతూ ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయం ముట్టడి చేస్తే అరెస్టు చేయడం దారుణమని ఎస్ఎఫ్ఐ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల వద్ద గురువారం ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వినయ్‌కుమార్ నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను, ఎస్ఎఫ్ఐ నాయకులను 47 మందిని అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు శోచనీయమన్నారు. రాజా, సుబహాన్, బాబు, పుష్పరాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం : జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రభుత్వమే ఉచితంగా పాఠ్య పుస్తకాలు ఇవ్వాలని విజయవాడ ఇంటర్ బోర్డు వద్ద ఆందోళనకు వెళ్లిన ఎస్ఎఫ్ఐ నాయకులను అక్రమ అరెస్టులను ఖండిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రాహుల్ తెలిపారు. సుందరయ్య భవన్ దగ్గర గురువారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కళాశాలలు ప్రారంభించి రెండు నెలలు కావస్తున్నా ఇంతవరకు విద్యార్థులకు పాఠ్యపుస్తకాల ఇవ్వకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు రాజశేఖర్, నాయకులు అరవింద్ పాల్గొన్నారు.

సిబిఐటిలో అవగాహన సదస్సు

చాపాడు : స్థానిక సిబిఐటి కళాశాలలో గురువారం బిటెక్. ద్వితీయ సంవత్సరం ఈఈఈ, ఈసిఈ విద్యార్థులకు ఎనర్జీ సిస్టం అండ్ సస్టైనబిలిటిపై అవగాహన సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిధిగా కెనడా వంటారియో టెక్ ఇంజనీరింగ్ అండ్ అప్లైడ్ సైన్స్ ప్రొఫెసర్ డాక్టర్ బివి రెడ్డి హాజయర్యారు. విద్యార్థులకు శక్తి వనరుల ఉపయోగం, స్థిరత్వంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులరెడ్డి, డైరెక్టర్ డాక్టర్ ప్రసన్న వెంకటేషన్ పాల్గొన్నారు. అనంతరం బివి రెడ్డిని ఘనంగా సన్మానించారు.

జెఎన్‌టియు ఇంజినీరింగ్ ఫలితాలు విడుదల

పులివెందుల రూరల్ : పులివెందుల జెఎన్‌టియు కళాశాలలో గత నెలలో జరిగిన బిటెక్ రెండవ సంవత్సరం మొదటి సెమిస్టర్(ఆర్15) సప్లిమెంటరీ, బిటెక్ మొదటి, రెండవ, మూడవ, నాలుగవ సంవత్సరం (ఆర్19)సప్లిమెంటరీ, మొదటి, రెండవ, మూడవ, నాలుగవ సంవత్సరం (ఆర్20) సప్లిమెంటరీ, ఎంటెక్ రెండవ సంవత్సరం మొదటి సెమిస్టర్(ఆర్21) రెగ్యులర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు గురువారం కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.వసుంధర తెలిపారు. ఫలితాలను కళాశాలల వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు.

వైద్యంపై దృష్టి సారించాలి

వేంపల్లె : విద్యార్థులు చదువుతోపాటు వైద్య జ్ఞానంపై కూడా దృష్టి పెట్టడం వల్ల ఇతరుల ప్రాణాలను కాపాడేందుకు వీలు ఉంటుందని బాషా హస్పిటల్ అధినేత, కళాశాల అభివృద్ధి మండలి సభ్యులు డాక్టర్ ఎస్ఎఫ్ బాషా చెప్పారు. గురువారం స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు ఆధ్వర్యంలో బేసిక్ లైఫ్ సపోర్ట్ పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, అధ్యాపకులు పాల్గొన్నారు.

అడ్మిషన్ల ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి

వేంపల్లె : ఆర్‌జెయుకెటి పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో 2023-24 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రక్రియ చేపట్టేందుకు ఏర్పాటు పూర్తి చేసినట్లు ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ సంధ్యారాణి తెలిపారు. గురువారం ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో చేపట్టిన అడ్మిషన్లు పక్రియకు చెందిన ఏర్పాట్లును ఆమె పరిశీలించి అధ్యాపకులకు తగు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలోని సెంట్రల్ లైబ్రరీలో శుక్రవారం నుండి విద్యార్థులకు అడ్మిషన్ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియను ఛాన్సలర్ కెసి రెడ్డి, వైస్ ఛాన్సలర్ విజయ్‌కుమార్ ప్రారభిస్తారని చెప్పారు.

పిల్లల గుర్తింపునకు ప్రశస్త్ యాప్

వేంపల్లె : ప్రత్యేక అవసరాలున్న పిల్లలను గుర్తించి వారి సమగ్ర వివరాలను నమోదు చేయటానికి ఎపి ప్రభుత్వం సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ రూపొందించిన ప్రశస్త్ యాప్‌ను ఉపాధ్యాయులందరూ నమోదు చేసుకోవాలని ఐఇ కో-ఆర్డినేటర్ కేశవరెడ్డి కోరారు. గురువారం స్థానిక భవిత కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి మాట్లాడుతూ మండలంలోని ఆయా పాఠశాలల్లో 130 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఐఇఆర్టీలు యశోద, సుజాత, సిఆర్పి సూర్యకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై పరువు నష్టం దావా వేస్తా : పుట్టా

చాపాడు : మైదుకూరు ఎమ్మెల్యే ఎస్. రఘురామిరెడ్డి తనపై తప్పుడు ఆరోపణలు చేశారని, వాటిని వారం రోజుల్లో నిరూపించ లేక పోతే లాయర్ ద్వారా నోటీసులు ఇచ్చి పరువు నష్టం దావా వేస్తానని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. గురువారం మైదుకూరులోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే బుధవారం తనపై నిరాధార ఆరోపణలు చేశారన్నారు. గత ప్రభుత్వ హయాంలో మైదుకూరు మున్సిపాలిటీలో అవినీతి జరిగిందని ఎమ్మెల్యే పదేపదే పేర్కొనడం సరిగా లేదన్నారు. ఆ సమయంలో మైదుకూరు ఎమ్మెల్యేగా తమరే ఉన్నారని గుర్తించుకోవాలన్నారు. అవినీతి జరుగుతుంటే ఎందుకు అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు. సమావేశంలో టిడిపి నాయకులు దాసరి బాబు, అన్నవరం సుధాకర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, ధనపాల జగన్, వెంకటసుబ్బయ్య, నాయకులు పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ క్రమం తప్పక చేపట్టాలి

చాపాడు : రికార్డుల నిర్వహణ క్రమం తప్పక చేపట్టాలని డిఎంహెచ్ఒ నాగరాజు సూచించారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని లక్ష్మీపేట విలేజ్ హెల్త్ క్లినిక్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈ సంజీవని, మందుల రికార్డులను పరిశీలించారు. స్థానిక అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి, గర్భిణులకు పంపిణీ చేసే పోషక పదార్థాలు, చిన్నపిల్లల భోజన వసతిని పరిశీలించారు. గర్భిణుల వివరాలు ఒకేలా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేష్ కు మార్, ఎంఒ జీవి రెడ్డి, ఎఎంఒ ప్రసాద్, ఎంపీహెచ్‌ఓ ఎం వివి ప్రసాద్, సిహెచ్ఒ మహాదేవ యాదవ్ పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వానికి చరమగీతం పాడేందుకు సిద్ధం కావాలి : బిటెక్ రవి

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి ప్రభుత్వానికి చరమగీతం పాడేందుకు కార్యకర్తలు సిద్ధం కావాలని టిడిపి పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. వేంపల్లెలోని ఎస్ఎన్ఆర్ కళ్యాణమండపంలో వేంపల్లె, వేముల, చక్రాయపేట మండలాల క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిలకు ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇంటిగ్రేటెడ్ కో-ఆర్డినేటర్ హర్షవర్ధన్ నాయకులు, కార్యకర్తలకు శిక్షణనిచ్చారు. అనంతరం బిటెక్ రవి మాట్లాడుతూ వైసిపి పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. టెలిగ్రామ్, టిడిపి యాప్, ఓటర్ వెరిఫికేషన్, హౌస్ మ్యాపింగ్‌పై నాయకులు, కార్యకర్తలు దృష్టి పెట్టాలని కోరారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైసిపి బంగాళాఖాతంలో కలపడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, నిమ్మకాయల దర్బార్, మైనార్టీ మండల కన్వీనర్ తెలంగాణ వలి, తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు బాలస్వామిరెడ్డి, జయచంద్రారెడ్డి, మహమ్మద్ ఇనాయతుల్లా, జిల్లా ఉపాధ్యక్షులు జగన్నాథరెడ్డి, రామగంగిరెడ్డి, తూగట్ల రాఘవరెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్, చక్రాయపేట కన్వీనర్ మహేశ్వరరెడ్డి, వీరబద్ర, నిమ్మకాయల షాకీర్, వేముల మండల కన్వీనర్ బ్రహయ్య, వేమా, ఈశ్వరయ్య, వెంకటయ్య, గోగుల మారుతి, నాయకులు పాల్గొన్నారు.

పులివెందులలో టిడిపి జెండా ఎగరేద్దాం

సింహాద్రిపురం : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో పులివెందులలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగరేద్దాం అని ఆ పార్టీ మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి పార్టీ శ్రేణులకు సూచించారు. గురువారం మండల కేంద్రమైన సింహాద్రిపురంలోని పార్టీ కార్యాలయంలో సింహాద్రిపురం, తొండూరు, లింగాల, పులివెందుల మండలాలకు చెందిన పలు ఇన్‌ఛార్జిలకు ఇంటిగ్రేటెడ్ శిక్షణ నిర్వహించారు.

విఆర్ఎల రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న విఆర్ఎల ప్రధాన డిమాండ్లను నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు. ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. పులివెందుల రెవెన్యూ కార్యాలయంలో పనిచేస్తున్న తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ప్రధాన డిమాండ్ పే స్కేల్‌ను అమలు చేయాలన్నారు. నామినీలుగా పని చేస్తున్న వారందరినీ విఆర్ఎలు నియమించాలని కోరారు. గత ఎన్నికల ముందు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి హామీలను అన్నింటిని నెరవేర్చాలన్నారు. లేనిపక్షంలో మండల కేంద్రాల్లో చేస్తున్న దీక్షలే కాకుండా ఆగస్టు 7, 8 తేదీల్లో కలెక్టరేట్ల వద్ద కూడా దీక్ష చేపడుతామని వారు హెచ్చరించారు. ఆగస్టు 23,24 తేదీల్లో విజయవాడలో రాష్ట్రస్థాయి దీక్షలను చేస్తామన్నారు. ఆగస్టు 25న జగనన్నకు నేరుగా చెబుదాం కార్యక్రమాన్ని చలో విజయవాడ చేపడతామన్నారు. కార్యక్రమంలో పులివెందులలో పనిచేస్తున్న విఆర్ఎలు పాల్గొన్నారు.

చక్రాయపేట : తహశీల్దార్ కార్యాలయం ఎదుట గ్రామ సేవకులు గురువారం తమ డిమాండ్లను సాధించుకునేందుకు దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో యూనియన్ మండల ఆధ్యక్షుడు. జి.ఎల్.నరసింహులు. జిల్లా సహాయ కార్యదర్శి పెద్దనారాయణ. రామచంద్ర, విఆర్ఎలు పాల్గొన్నారు.

పంట నమోదు పారదర్శకంగా చేయాలి

ముద్దనూరు : రైతులు సాగు చేసిన పంట వివరాలను పారదర్శకంగా నమోదు చేయాలని ఎడిఎ మాధవి సిబ్బందికి సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలోని సభాభవనంలో గురువారం ఎఒ వెంకట కృష్ణారెడ్డి అధ్యక్షతన డివిజన్ స్థాయిలో క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ పంట నమోదులో ఎదురయ్యే సమస్యలు, వాటిని అధిగమించే విధానంపై శిక్షణలో వివరించారు. సాంకేతిక వ్యవసాయ అధికారి గోవర్ధన్ క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణనిచ్చారు. ముద్దనూరు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ అధికారులు అంకిరెడ్డి, రామాంజనేయులు రెడ్డి పాల్గొన్నారు. **చాపాడు :** రైతులు సాగుచేసిన ప్రతి సర్వే నెంబర్‌లోని పంటను ఇ పంటలో నమోదు చేయాలని మైదుకూరు డివిజన్ వ్యవసాయ శాఖ ఎడిఎ కృష్ణమూర్తి తెలిపారు. మైదుకూరులోని సిఎల్ఆర్సి భవనంలో డివిజన్ పరిధిలోని వ్యవసాయ అధికారులకు, ఆర్బీకే విఎఎలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్ వెంకటేష్ సిబ్బందికి ఇ- పంట నమోదుపై అవగాహన కల్పించారు. మైదుకూరు, దువ్వూరు, చాపాడు, రాజుపాలెం మండలాల ఎఒలు ప్రసన్న, మ్యాగీ, శివరామిరెడ్డి పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** పంట నమోదులో జియో కోయార్డినేట్స్ సర్వే నెంబర్లు విభజన తప్పనిసరని వ్యవసాయ, ఉద్యాన సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఎడిఎ కార్యాలయంలో ఈ క్రాప్ నమోదుపై విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెన్స్‌తో శిక్షణనిచ్చారు. ఎడిఎ సురేష్‌రెడ్డి, ఎఒ శివశంకర్‌రెడ్డి, పెద్దముడియం ఎఒ అరుణ, మాస్టర్‌ట్రైనర్ చిట్టిబాబు, వి.సుస్మిత పాల్గొన్నారు.